
ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

నంద్యాల జిల్లా వార్తలు 5

శుక్రవారం 5 జూలై 2024



అదే చిరుతపులి..



నల్లమల అడవుల్లో 2023లో వదిలిన చిరుతపులి (ఫైల్)

- తిరుమల, నల్లమలలో దాడి చేసింది అదే..
- వివరాలను వెల్లడించిన సబ్ డీఎఫ్‌వో

రుద్రవరం, జూలై 4 : శేషాచల అడవుల్లో చిన్నారిని చంపిన చిరుత పులి, నల్లమలలో మహిళపై దాడి చేసిన చిరుతపులి ఒక్కటేనని సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గురువారం రుద్రవరం సబ్ డివిజన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 2023 శేషాచలం అడవుల్లో తిరుమల కాలినడక దారిలో ఓ చిన్నారిని చంపేసిన చిరుతపులి, జూన్ 25న నల్లమల అడవుల్లోని చెలిమ రేంజ్‌లో పచ్చర్ల ప్రాంతంలో మాజీ ఉప సర్పంచ్ బషీరున్నీసాబీ అనే మహిళను చంపిన చిరుత పులి ఒక్కటేనని అన్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ టైగర్ రిజర్వు ఫారెస్టు శాస్త్రవేత్తలు చిరుతపులి మచ్చలు, పళ్లు, శరీర సౌష్టవాన్ని పరిశీలించి పై రెండు ఘటనల్లో దాడి చేసిన చిరుత ఒక్కటేనని తేల్చినట్లు ఆయన తెలిపారు. 2023 తిరుమల కాలినడకలో చిన్నారిపై దాడి చేసిన చిరుతపులిని నంద్యాల ఫారెస్టు డివిజన్ గుండ్ల బ్రహ్మేశ్వరం అటవీ ప్రాంతంలో అప్పట్లో వదిలారని అన్నారు. పచ్చర్ల ప్రాంతంలో మహిళపై దాడి చేసి చంపిన తరువాత జూన్ 28న చిరుతపులి బోనుకు చిక్కిందని, తిరుపతిలోని ఎస్వీ జువాలజికల్ పార్కుకు తరలించామని చెప్పారు. దీని వయస్సు 5 నుంచి 6 సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు. నల్లమల అడవిలో మరో రెండు చిరుతలు సంచరిస్తున్నాయని తెలిపారు. అయితే పచ్చర్ల ప్రాంతంలో మహిళపై దాడి చేసిన చిరుతపులి, ప్రకాశం జిల్లా గిద్దలూరు సమీపంలో పట్టుబడిన చిరుతపులి వేరని సబ్ డీఎఫ్‌వో తెలిపారు. కార్యక్రమంలో రేంజర్ శ్రీపతినాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి



నల్లమలలో బోనుకు చిక్కిన చిరుతపులి (ఫైల్)



పెంచికలపాడులో తక్కువ ధరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్న పత్తి

అరకొర మద్దతు

కేంద్రం ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులు సాగు చేసే పంటలకు నిర్ణయించిన మద్దతు ధరల వివరాలు క్వింటానికి

పంట పేరు	మద్దతు ధర (రూ.లలో)
పత్తి - పొడుగు రకం	రూ.7,521
పత్తి- మధ్య రకం	రూ.7,121
వరి- గ్రేడ్ ఏ	రూ.7,320
వరి-కామన్ రకం	రూ.2,300
జొన్న హైబ్రిడ్	రూ.3,371
జొన్న-మాల్‌బండి	రూ.3,421
సజ్జ	రూ.2,615
రాగులు	రూ.4,290
మొక్కజొన్న	రూ.2,225
కంది	రూ.7,550
పెసర	రూ.8,682
మినుములు	రూ.7,400
వేరుశనగ	రూ.6,783
పొద్దుతిరుగుడు	రూ.7,280
సోయాబీన్	రూ.4,892
నువ్వులు	రూ.9,267

- కేంద్రం నిర్ణయంపట్ల రైతుల అసంతృప్తి
- సాగు ఖర్చు బారెడు.. మద్దతు మాత్రం మూరెడు
- కొన్ని పంటలకే మద్దతు ధర ప్రకటన
- ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేయని వైనం

కర్నూలు(అగ్రికల్చర్), జూలై 4:

అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్న రైతులకు కేంద్ర ప్రభుత్వం నామ్‌కే వాస్తేగా మద్దతు ధరలు ప్రకటించి చేతులు దులుపుకుంటోందనే విమర్శ ఉంది. ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు కేంద్ర ప్రభుత్వం ఏ పంటకు ఎంత ధర గిట్టుబాటు అవుతుందో అంచనా వేసి మద్దతు ధర ప్రకటించడం ఆనవాయితీ. అయితే.. వాతావరణ పరిస్థితులు అనుకూలించని సమయంలో పంట నష్టపోతే గిట్టుబాటు ధర ఎంత ఇవ్వాలనే ఆలోచనతో మద్దతు ధరను ప్రకటించకపోవడంపై అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అట్లాగే కేవలం కొన్ని పంటలకే కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించడం పట్ల రైతులు ఆగ్రహంతో ఉన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కూరగాయలతో పాటు ఆహార వాణిజ్య పంటలు సాగు చేస్తుండగా.. కేంద్ర ప్రభుత్వం మాత్రం పది రోజుల క్రితం కేవలం 13 పంటలకు మాత్రమే మద్దతు ధరను ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి ప్రతి పంటకు ఎంత మద్దతు ధర ఇస్తే.. గిట్టుబాటు అవుతుందో నిర్ణయించి ఆ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సిఫారసులను పంపినా పరిగణనలోకి తీసుకోవడం లేదు. వరి పంటకు క్వింటం ధాన్యానికి రూ.3వేలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేస్తే.. కేవలం రూ.2,300కే పరిమితం చేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది.

ఆహార ధాన్యాలైన వరి, మొక్కజొన్న, కొర్ర, సజ్జ, జొన్న తదితర పంటలకు కేంద్రం బొటాబోటి మద్దతు ధరలే లభించాయి. వాణిజ్య పంటల్లో పత్తి, వేరుశనగ, మొక్కజొన్న తదితర వాటికి నామమాత్రంగానే మద్దతు ధర ఇస్తోంది. జిల్లాలో ఖరీఫ్‌లో లక్ష ఎకరాల్లో కూరగాయల పంటలు సాగవుతున్నాయి. ప్రతిసారి టమోటా, మిర్చి, ఉల్లి పంటలను సాగు చేస్తున్నా కర్నూలు, నంద్యాల జిల్లాలోని 60వేల మంది రైతులు మద్దతు ధర ఈసారైనా ప్రకటిస్తుందోనని రైతులు ఎదురు చూశారు. అయితే.. వారికి కేంద్ర నిర్ణయం నిరాశను మిగిల్చింది. పత్తిపంట సాగులో రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉన్న కర్నూలు జిల్లాలోని రైతులు ఏటా నష్టపోతూనే ఉన్నారు. కేంద్ర సంస్థ సీసీఐ బహిరంగ మార్కెట్‌లో అందించే ధర కంటే తక్కువ ధరకే కొనుగోలు చేస్తుండటంపై వారిలో తీవ్ర ఆందోళన వ్యక్తమ వుతోంది. పత్తి పంటకు క్వింటానికి కేంద్రం కేవలం రూ.7,521 మాత్రమే మద్దతు ధరగా నిర్ణయించింది. ఎకరాకు 12 క్వింటాళ్ల దాకా ఉత్పత్తి రైతులకు అందుతుందని, ఈ ధర వల్ల రైతులకు లాభం ఉంటుందని కేంద్రం స్పష్టం చేసింది. అయితే గత ఐదు సంవత్సరాలుగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో అతివృష్టి, అనావృష్టి కారణంగా ఎకరాకు మూడు, నాలుగు క్వింటాళ్లకు మించి రైతు చేతికి అందలేదు. అదే విధంగా వరి పంటకు క్వింటానికి రూ.2,300 మాత్రమే మద్దతు ధరగా ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రూ.3వేలను అందిస్తేనే రైతుకు గిట్టుబాటు అవుతుందని సిఫారసు చేసింది. ఈ సిఫారసును కేంద్రం ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోలేదు.

దళారులే దిక్కు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కూరగాయల పంటలతో కలిపి దాదాపు 30 పంటలకుపైబడే రైతులు సాగు చేస్తున్నారు. అయితే.. కేంద్ర ప్రభుత్వం మాత్రం కేవలం 13 పంటలను మాత్రమే పరిగణనలోకి తీసుకుని వాటికి అరకొర మద్దతు ధరలను ప్రకటిస్తోంది. రాష్ట్రంలోనే అత్యధిక విస్తీర్ణంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో కూరగాయల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఉల్లి, టమోటా, మిర్చి పంటలు లక్ష ఎకరాల్లో సాగవుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా భారీ స్థాయిలో పంట నష్టం జరుగుతోంది. ఓ వైపు పంట నష్టం, ఇంకో వైపు రైతులంతా ఈ పంటలనే ఎక్కువగా సాగు చేయడంతో ధర పూర్తిగా తగ్గిపోవడం.. ఈ రెండు కారణాలతో కేంద్రం ప్రకటించిన మద్దతు ధర వల్ల రైతులకు ఏ మాత్రం ప్రయోజనం కలగడం లేదు. పంట దిగుబడులను మార్కెట్‌కు తీసుకెళ్లేందు కోసం రవాణా ఖర్చులుకూడా గిట్టుబాటు కావడం లేదు.

మద్దతు ధర అమలు చేస్తాం

కేంద్రం ప్రకటించిన వివిధ పంటల మద్దతు ధరలు రైతులకు ఖచ్చితంగా అందిస్తాం. మార్కెట్ యార్డులో రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న రైతులను కట్టడి చేస్తున్నాము.

నారాయణమూర్తి, ఏడీఎం

వ్యాపారులను కట్టడి చేయని మద్దతు ధర

క్వింటం పత్తి పంటకు కేంద్రం ప్రకటించిన రూ.7,521 దక్కించుకుందామని కర్నూలు మండల పరిధిలో పెంచికలపాడులో సీసీఐ ఏర్పాటు చేసిన కేంద్రానికి రైతులు పత్తిని తీసుకుని వెళితే.. రకరకాల కొర్రీలు వేసి రూ.5వేల నుంచి రూ.6వేలు మాత్రమే ఇస్తున్నారు. దీంతో రైతులు ఆ పరిసరాల్లోనే పొంచి వున్న వ్యాపారులకు సరుకు వదిలేయాల్సి వస్తోంది. గత ఏడాది ఇదే జరిగింది. అదేవిధంగా వేరుశనగ పంటకు కేంద్రం క్వింటానికి రూ.6,783 మద్దతు ధరగా ప్రకటించింది. అయితే.. ఈ ధరను ఇచ్చేందుకు మార్కెట్ యార్డుల్లో వ్యాపారులు ముందుకు రావడం లేదు. కనీసం కేంద్ర ప్రభుత్వమైనా నాఫెడ్, ఆయిల్‌ఫెడ్ సంస్థల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేస్తుందేమోనని ఆశలు పెట్టుకున్నా గత సంవత్సరం నిరాశే వ్యక్తమైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.3వేల కోట్ల నిధులను రైతుల నుంచి పంట ఉత్పత్తులను సేకరించేందుకు స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పుకుంది. గత సంవత్సరం నామ్‌కే వాస్తేగా మొక్కజొన్న, మినుములు, కందులను మాత్రమే రైతుల నుంచి సేకరించారు. మిగిలిన పంట ఉత్పత్తులను నిబంధనల పేరుతో కొనుగోలు చేయలేదు. కనీసం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 15 మార్కెట్ యార్డులకు రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులను వ్యాపారులతో గిట్టుబాటు ధర అందించేందుకు ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

విప్లవ జ్యోతి అల్లూరి

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, అధికారులు

నంద్యాల (కల్చరల్), జూలై 4: స్వాతంత్ర సంగ్రామంలో బ్రిటీష్ పాలకులతో విరోచిత పోరాటం చేసి అసువులు బాసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో పద్మజ, పూలమాలలు వేసి ఘనంగా పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 75 సంవత్సరాల వేడుకల సందర్భంగా అల్లూరి సీతారామరాజు, ఉయ్యాలవాడ సరసింహారెడ్డిలు స్వాతంత్ర సాధన కోసం చేసిన పోరాటాలను డాక్యుమెంటరీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి శివప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి

నంద్యాల క్రైం, జూలై 4: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి ఉత్సవాలను నంద్యాల జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి సీతారామరాజు జరిపిన సాయుధ పోరాటం చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా మిగిలిపోయిందన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని, స్వాతంత్ర్యం కోసమే తన ప్రాణాలు అర్పించిన యోధుడిగా చరిత్రలో నిలిచిపోయాడని కొనియాడారు. 27 ఏళ్ల వయస్సులోనే నిరుపేదలు, నిరక్షరాస్యులు, అమాయకులైన అనుచరులతో చాలా తక్కువ యుద్ధ పరికరాలతో బ్రిటీష్ సామ్రాజ్యానికి ఎదురొడ్డి వారికి ముచ్చెమటలు పట్టించిన అమర వీరుడు అల్లూరి అని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, డీపీవో కార్యాలయ అధికారులు నిజాముద్దీన్, ఖాదర్‌వలి, ఎస్పీ సీసీ నాగరాజు, ఇన్‌స్పెక్టర్లు రవీంద్ర, చంద్రబాబునాయుడు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, నాగభూషణం, పోలీస్ కార్యాలయ సిబ్బంది, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి



బంద్ విజయవంతం



బంద్ నిర్వహిస్తున్న విద్యార్థి యువజన సంఘాల నాయకులు

నంద్యాల (నూనెపల్లె), జూలై 4: నీట్‌లో జరిగిన అవకతవకలపై చేపట్టిన విద్యాసంస్థల బంద్ గురువారం విజయవంతమైంది. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ పీఎస్‌యూ, ఏఐఎస్ఏ పీడీఎస్‌యూ, పీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. పద్మావతి నగర్ ఆర్చి నుంచి శ్రీనివాస సెంటరు వరకు ర్యాలీ నిర్వహించారు. శ్రీనివాస నగర్ సెంటరులో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పలు విద్యా సంస్థలకు వెళ్లి బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి యువజన సంఘం నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర పదాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షల్లో నష్టపోయిన విద్యార్థులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు రమేష్ నాయక్ , పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవి, ఏఐఎస్ఏ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నాగార్జున, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ. 3.98 కోట్లు



మల్లన్న కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీశైలం, జులై 4: శ్రీశైల మహాక్షేత్రంలో మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మ వార్లకు భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. లెక్కింపులో ఆలయ హుండీల ద్వారా రూ.3,98,34,583 నగదు రూపంలో రాబడిగా లభించింది. భక్తులు గత 28 రోజులలో సమర్పించిన కానుకలను లెక్కించారు. నగదుతో పాటు 148 గ్రాముల బంగారు, 6.260 కేజీల వెండి సమర్పించారు. అలాగే 835 యూఎస్ఏ డాలర్లు, 105 కెనడా డాలర్లు, 2 ఖత్తార్ రియాల్, 35 ఆస్ట్రేలియా డాలర్లు, 30 యూరోలు, 106 మలేసియా రింగిట్స్ మొదలైన విదేశీ కరెన్సీని భక్తులు సమర్పించారు. పటిష్టమైన భద్రతా, సీసీ కెమెరాలు, అధికారుల పర్యవేక్షణలో ఈ హుండీ ఆదాన్ని లెక్కించారు. కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు, అన్ని విభాగాల అధిపతులు, పర్యవేక్షకులు, సిబ్బంది, శివసేవకులు పాల్గొన్నారు.

ఇకపై ఇసుక ఉచితం..!


ఈర్లదిన్నె రీచ్ వద్ద నది ఒడ్డున నిల్వ చేసిన ఇసుక (ఫైల్)

- వైసీపీ హయాంలో టిప్పరు రూ.25 వేల పైమాటే
- ఉచిత ఇసుక హామీ దిశగా చంద్రబాబు ప్రభుత్వం
- విధి విధానాలు రూపొందిస్తున్న మైనింగ్ యంత్రాంగం
- స్థానిక సంస్థలకు చెల్లించే రాయల్టీ, డీఎంఎఫ్, మెరిట్ చార్జీలు మాత్రమే వసూలు
- 8 నుంచి 'ఉచిత ఇసుక పాలసీ' అమలుకు కసరత్తు

కర్నూలు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గత జగన్ ప్రభుత్వంలో ఇసుక బంగారంగా మారింది. భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కరువై ఆర్థికంగా చితికిపోయారు. నిర్మాణ రంగం కుదేలైంది. ధనాపేక్షతో వైసీపీ నాయకులు కొందరు ఇసుకపై పెత్తనం చెలాయించి రూ.కోట్లు దోచేశారు. ఇసుక దక్కక సామాన్య ప్రజల సొంతింటి కల కలగానే మిగిలింది. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం రాగానే ఉచితంగా ఇసుక ఇస్తామని ఎన్నికల్లో చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఇదే అంశాన్ని మనిఫెస్టోలో కూడా పొందుపరిచారు. ఎన్నికల హామీ అమలులో భాగంగా ఉచిత ఇసుక పాలసీ అమలుకు చంద్రబాబు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విధివిధానాలపై మైనింగ్ యంత్రాంగం కసరత్తు చేస్తుంది. వైసీపీ ప్రభుత్వంలో ఇసుక టన్ను రేటు రూ.475 నిర్ణయించినా.. అనధికారికంగా రూ.వేలల్లో వసులు చేశారు. టిప్పరు ఇసుక రూ.25-30 వేల వరకు విక్రయించారు. తాజాగా రాయల్టీ, డీఎంఎఫ్, మెరిట్ చార్జీలు టన్నుకు రూ.89 మాత్రమే వసులు చేస్తుంది. ఆ మొత్తం స్థానిక సంస్థలకు వెళ్తుంది. ప్రభుత్వ ఖాజానాకు ఒక్కపైసా కూడా చేరదు. అంటే పూర్తిగా ఇసుక ఉచితంగా దక్కనుంది. ఈ పాలసీ ఈ నెల 8 నుంచి అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో తుంగభద్ర నదిలో మాత్రమే ఇసుక రీచ్‌లను గుర్తించారు. కౌతాళం మండలం నదిచాగి వద్ద 9.8 హెక్టార్లు, గుడికంబాళి గ్రామం వద్ద 10 హెక్టార్లు, మరళి గ్రామం వద్ద 5 హెక్టార్ల ఇసుక ఓపన్ రీచ్‌లు గుర్తించారు. సుంకేసుల జలాశయం ఎగువన సి.బెళగల్ మండలం పరిధిలో కొత్తకోట, కె.సింగవరం, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాల వద్ద మరో నాలుగు డిసిల్టేషన్ రీచులు (నీటిలో బోటు ద్వారా ఇసుక తవ్వకాలు) గనులు, భూగర్భవనరుల శాఖ (మైనింగ్) అధికారులు గుర్తించారు. రాష్ట్ర విభజన తరువాత కొలుదీరిన టీడీపీ ప్రభుత్వం అప్పట్లో ఉచిత ఇసుక పాలసీ అమలు చేసింది. ప్రజలు ఏనాడు ఇసుక కోసం ఇబ్బందులు పడలేదు. అయితే 2019లో వచ్చిన జగన్ ప్రభుత్వం నూతన ఇసుక పాలసీ అంటూ ఇసుకకు రేటు కట్టి.. ఇసుక తవ్వకాలు, రవాణా కాంట్రాక్టును రాష్ట్ర వ్యాప్తంగా జేపీ పవర్ సంస్థకు, ఆ తరువాత ప్రతిమ సంస్థకు ఇచ్చారు. ప్రభుత్వం టన్ను ఇసుక ధర రూ.475 నిర్ణయిస్తే... అనుమతుల మసుగులో కొందరు వైసీపీ నాయకులు కృత్రిక కొరత సృష్టించారు. ఫలితంగా టిప్పరు ఇసుక రూ.25-30 వేలకు పైగా విక్రయించి రూ.కోట్లు కొల్లగొట్టారు. లీజు గడువు ముగిసినా, పర్యావరణ అనుమతులు లేకపోయినా అధికారం మాటున తుంగభద్ర నదిని ఇష్టారాజ్యంగా తోడేశారు. జూన్ 12న సీఎం చంద్రబాబు సారథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరడం, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక పాలసీ అమలుకు కసరత్తు చేస్తున్నారు. ఇక ఉచితంగా ఇసుక లభిస్తుండడంతో భవన నిర్మాణ కార్మికులు, సామాన్య ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




సి.బెళగల్ మండలం కె.సింగవరంలో ఇసుక రీచ్

రూ.కోట్లలో ఇసుకాసురుల దోపిడీ

వైసీపీ ప్రభుత్వంలో ఇసుక రూపంలో అప్పటి అధికార పార్టీ నాయకులు రూ.కోట్లు దోచుకున్నారు. జగన్ ప్రభుత్వం రాగానే ఇసుకపై కన్నేశారు. ఓపన్ రీచ్‌ల్లో టన్ను రూ.475, డిసిల్టేషన్ రీచ్‌లో రూ.625లుగా నిర్ణయించారు. తవ్వకాలు, రవాణా కాంట్రాక్టును ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ఇసుక రీచ్‌లో పెత్తనం అంతాకూడా స్థానిక వైసీపీ నాయకులదే సాగేది. సి.బెళగల్ మండలం కె.సింగవరం, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె డిసిల్టింగ్ రీచ్‌ల నుంచి తీసుకొచ్చిన 24 టన్నుల ఇసుక టిప్పర్ కర్నూలు నగరంలో రూ.25 వేల నుంచి రూ.30 వేలకు పైగా విక్రయించారు. వర్షాకాలంలో బ్లాక్ మార్కెట్లో ఇష్టారాజ్యంగా అమ్మకాలు చేశారు. రవాణా ఖర్చు రూ.6-7 వేలు అవుతుంది. అంటే టన్ను రూ.750 నుంచి రూ.వెయ్యికి పైగానే విక్రయించి ఇసుక రూపంలో దోపిడీ చేశారు. హంద్రీ, వేదవతి నదుల్లో ఇసుక రీచ్‌లకు అనుమతులు లేకపోవడంతో.. అక్కడా ఒక్క పైసా కూడా ప్రభుత్వానికి చెల్లించకుండానే అధికారం మాటున ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేసి నదులు, వంకలు, వాగులు కొల్లగొట్టారు. మైనింగ్ అధికారుల లెక్కల ప్రకారమే రోజుకు 3 వేల టన్నులు ఇసుక రవాణా చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన రేటు ప్రకారమే నెలకు రూ.4.50 కోట్లు చొప్పున ఏడాదికి రూ.48-50 కోట్లు, గత ఐదేళ్లలో రూ.250 కోట్లు వరకు ప్రభుత్వ ఖజానాకు చేరింది. అనధికారింగా గత వైసీపీ ప్రభుత్వ పెద్దలు, అధికార పార్టీ నాయకుల జేబుల్లో అంతేస్థాయిలో చేరి ఉంటుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

నాగులదిన్నె రీచ్‌ను ఆమోదించని ఎస్ఈఐఏఏ

కౌతాళం మండలం నదిచాగి, గుడికంబాలి, మరళి ఇసుక రీచ్‌లకు పర్యావరణ అనుమతులు (ఈసీ) ఇస్తూ టర్మ్ ఆఫ్ రెఫరెన్స్ (టీఓఆర్) వచ్చింది. ప్రజా అభిప్రాయ సేకరణ పూర్తి చేస్తే ఇసుక తవ్వకాలు చేపట్టేందుకు ఎలాంటి అడ్డంకులు ఉండవు. నందవరం మండలం నాగులదిన్నె వద్ద తుంగభద్ర నదిలో 5 హెక్టార్లలో ఇసుక రీచ్‌ను గుర్తించారు. అయితే ఆ రీచ్‌కు అతిసమీపంలో తాగునీటి పథకాలు ఉండడం వల్ల భవిషత్తులో సమీప గ్రామాల ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు తలెత్తరాదని స్టేట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ (ఎస్ఈఐఏఏ) ఈ రీచ్‌కు అమోదం తెలపలేదు. ఇక్కడ ఇసుక తవ్వకాలు చేస్తే ఎస్ఈఐఏఏ నిబంధనలు అతిక్రమించినట్లే అవుతుంది.



విధివిధానలు రూపొందిస్తున్నారు

సీఎం చంద్రబాబు ఉచిత ఇసుక పాలసీని ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు విధివిధానాలు రూపొందిస్తున్నాం. రాయల్టీ, డీఎంఎఫ్, మెరిట్ సెస్సు మాత్రం టన్నుకు రూ.89 వసులు చేసే అవకాశం ఉంది. ఈ డబ్బు కూడా ప్రభుత్వానికి వెళ్లదు. స్థానిక పంచాయతీలు, మున్సిపాలిటీలకు చేరుతుంది. రవాణా, లోడింగ్ చార్జీలు వినియోగదారులే భరించాల్సి ఉంటుంది. 8వ తేది నుంచి పక్కాగా అమలు చేసే అవకాశం ఉంది.

- రాజశేఖర్, డీడీ, మైనింగ్ శాఖ, కర్నూలు

కార్మికుల్లో హర్షాతిరేకాలు

గత వైసీపీ ప్రభుత్వంలో సాగిన ఇసుక దోపిడీకి కళ్లెం వేయడంతో పాటు ప్రజలకు ఉచితంగా ఇవ్వాలనే లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ అమలుకు కసరత్తు చేస్తోంది. ఈ నెల 8వ తేదీ నుంచి అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ విధానం అమలులోకి వస్తే కేవలం రాయల్టీ, జిల్లా మినరల్ ఫండ్ (డీఎంఎఫ్), మెరిట్ చార్జీలు మాత్రం టన్నుకు రూ.89 వసులు చేస్తారు. ఈ డబ్బు కూడా ప్రభుత్వ ఖజానాకు చేరదు. స్థానిక సంస్థల అభివృద్ధి, ఆర్థిక బలోపేతం కోసం పంచాయతీలు, మున్సిపాలిటీల ఖాతాలకు జమ చేస్తారు. లోడింగ్, రవాణా చార్జీలు ప్రభుత్వమే భరించాలి. ఈ లెక్కన ఓపన్ రీచ్‌ల్లో లోడింగ్ నిర్వహణ చార్జీలతో కలిపి టన్నుకు రూ.155 చెల్లించాల్సి వస్తుంది. అంటే.. టన్నుకు రూ.320 ప్రకారం 24 టన్నుల టిప్పరుకు రూ.7,700 వరకు ఆదా అవుతుంది. అదే డిసిల్టింగ్ రీచ్‌ల్లో రాయల్టీ, డీఎంఎఫ్ చార్జీలు, లోడింగ్, రీచ్ మెయింటెన్స్ కలిపి టన్ను రూ.315-325 పడుతుంది. ఈ లెక్కన రవాణాతో 24 టన్నుల టిప్పరు కర్నూలు నగరానికి చేరిస్తే రూ.14-15 వేలకు మించదు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన దోపిడితో పోలిస్తే.. ఒక టిప్పరుపై రూ.15 వేలకు పైగా వరకు ఇసుక వినియోగదారులు, బిల్డర్లకు మిగులుబాటు అవుతుందని అంచనా. పేద, మధ్య తరగతి ప్రజలు 1,250 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు కట్టుకోవాలంటే 20-25 టిప్పర్లు ఇసుక అవసరం ఉంటుందని ఓ బిల్డర్ తెలిపాడు. ఈ ప్రకారం చంద్రబాబు తీసుకొచ్చే ఉచిత ఇసుక పాలసీ విధానం వల్ల రూ.3 నుంచి 4 లక్షల వరకు నిర్మాణ ఖర్చు ఆదా అవుతుందని అంటున్నారు. అదే క్రమంలో నిర్మాణ రంగం బలోపేతం అవడంతో భవన నిర్మాణ కార్మికులు కూడా చేతి నిండా ఉపాధి లభిస్తుంది.

హైవేలకు నిధులు కేటాయించండి

కేంద్రమంత్రులను కోరిన బీసీ జనార్దన్ రెడ్డి


కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీతో భేటీ అయిన చంద్రబాబు, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తదితరులు

బనగానపల్లె, జూలై 4 : ఆంధ్రప్రదేశ్‌లో అధ్వానంగా ఉన్న రహదారులకు, పెండింగ్‌లో ఉన్న హైవే రోడ్లకు నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలిసి రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని కోరారు. ఢిల్లీలో సీఎం చంద్రబాబునాయుడు వెంట బీసీ జనార్దన్‌రెడ్డి నితిన్‌గడ్కరీతో జరిగిన చర్చల్లో గురువారం పాల్గొన్నారు. ఏపీ రోడ్ల దుస్థితి గురించి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. నిధుల విడుదలకు సహకరించాలని వారు కోరారు. సీఎం వెంట ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ తదితర అధికారులు ఉన్నారు.

మదనపల్లిలో రైతు సంఘం రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు

కర్నూలు(న్యూసిటీ), జూలై 4: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్వర్యంలో ఈ నెల 29, 30, 31 తేదీలలో అన్నమయ్య జిల్లా మదనపల్లిలో రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి కే జగన్నాథం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని పరిరక్షించి దేశాన్ని కాపాడాలనే ఉద్దేశంతో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణ తరగతులలో నష్టాతులైన వ్యవసాయ అధికారులు, నిపుణులు, శాథస్త్రవేత్తలు పాల్గొంటారని తెలిపారు. జిల్లా నుంచి ఎంపికైన కార్యకర్తలు శిక్షణ తరగతులలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పనులను సకాలంలో పూర్తి చేయండి

జిల్లా హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), జూలై 4: జిల్లా వ్యాప్తంగా పలు పథకాల కింద అపరిష్కృతంగా ఉన్న గృహాలను సకాలంలో పూర్తయ్యేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ సిద్ధలింగమూర్తి అన్నారు. గురువారం ఆయన ఆన్‌లైన్ సమావేశం ద్వారా జిల్లాలోని బాధ్యులైన ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఇందులో భాగంగా గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్లను పూర్తి చేసేందుకు ప్రాధాన్యత క్రమంలో లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. ప్రస్తుతం 17,964 ఇళ్ల పలు దశల్లో నిలిచిపోయి ఉన్నాయని, తొలి దశలో 8656 ఇళ్లను పూర్తి చేసేందుకు 100 రోజుల ప్రణాళికను రూపొందించాలన్నారు. మిగతా వాటిని మార్చిలోపు పూర్తయ్యేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని తెలిపారు. పనుల పురోగతిపై నిత్యం పరిశీలన, పర్యవేక్షణ ఉంటుందని, అలసత్వం వహిస్తే బాధ్యులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని సిద్ధలింగమూర్తి హెచ్చరించారు.

కర్నూలు ట్రాన్స్‌కో ఎస్ఈలకు బదిలీలు

కల్లూరు, జులై 4: కర్నూలు జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈలను బదిలీ చేస్తూ కార్పొరేట్ కార్యాలయం బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. విద్యుత్‌శాఖ ట్రాన్స్‌కోలో విధులు నిర్వహిస్తున్న కర్నూలు ఓ అండ్ ఎం ఎస్ఈ జి.బాబు రాజేంద్రను కర్నూలు ప్రాజెక్ట్ ఎస్ఈగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అదే విధంగా కర్నూలు ప్రాజెక్ట్ ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న కేవీ రామకృష్ణను విజయవాడ 400 కేవీ ఎస్ఈగా బదిలీ చేస్తూ కార్పొరేట్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. కడప ఓ అండ్ ఎం ఎస్ఈ కె.మధుసూదన్‌రావును కర్నూలు ట్రాన్స్‌కో ఓ అండ్ ఎం ఎస్ఈగా బదిలీ చేశారు.

కలెక్టర్‌కు దూదేకుల సంఘం శుభాకాంక్షలు



కర్నూలు(కలెక్టరేట్), జూలై 4: కర్నూలు జిల్లా నూతన కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు దూదేకుల సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని దూదేకుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో దూదేకుల సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు బాబన్, కర్నూలు జిల్లా దూదేకుల సంఘం అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాషా, రాష్ట్ర కోశాధికారి దస్తగిరి, సిద్దయ్య, సాయిబాబా, మస్తాన్, షేక్షావలి, హుశేనప్ప, ఆదామ్, టిప్పు సుల్తాన్ పాల్గొన్నారు.

ఉర్దూ వర్శిటీలో డిగ్రీ ప్రవేశాలకు ధరఖాస్తులు

కర్నూలు(అర్బన్), జూలై 4: జిల్లా కేంద్రంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి నాలుగేళ్ల హనర్స్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీని వాసులు తెలిపారు. ఓఏఎండీసీ పోర్టల్ ద్వారా యూనివర్సిటీలో బీఏ. ఎకా నామి క్స్, బికామ్ కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో విద్యా ర్థులు చేరవచ్చని పెర్కొన్నారు. ఈనెల 11 నుంచి 15 తేదీలోగా విద్యార్థులు తమ వెబ్ ఆప్షన్స్‌లో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటిని ఎంపిక చేసుకో వాలన్నారు. ఈనెల 19న విద్యార్థులకు సీట్ల కేటాయింపు, 20నుంచి 22 వరకు విద్యార్థులు యూనివర్సిటీలో రిపోర్ట్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 79934 22489, 94904 94532 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి

ఆస్పరి, జూలై 4: బైక్‌పై నుంచి పడి గురువారం ఓ మహి ళ మృతి చెందింది. కర్నూలులో నివాసం ఉంటున్న గౌసియా, ఏఆర్ బాబా దంపతులతోపాటు ఇద్దరు కుమారులు అబ్దుల్ రసూల్, అబ్దుల్ రహమాన్‌తో కలిసి హొళగుంద మండలంలోని ఎల్లార్తి దర్గాకు 2వ తేదీన వెళ్లారు. మొక్కు తీర్చుకొని వస్తుం డగా గురువారం మండలంలోని చిన్న హోతూర్ గ్రామ సమీ పంలో ద్విచక్ర వాహనంపై నుంచి గౌసియా (27) స్పృహ తప్పి కింద పడింది. తీవ్ర గాయాలు కావడంతో భర్త ఏఆర్ బాబా ఆలూరు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటి కే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హను మంతప్ప తెలిపారు.

మోటార్ సైకిల్ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

పాణ్యం, జూలై 4: స్థానిక జాతీయ రహదారిపై రైస్ మిల్లు సమీపంలో గురువారం మోటారు సైకిల్ ఢీకొని ఆటోడ్రైవర్ మృతి చెందాడు. పాణ్యం ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా కల్లూరు మండలం, ముజఫర్ నగర్‌కు చెందిన కోనంగి శ్రీరాములు (49) ఆటోలో ప్రయాణికులను ఎక్కించుకొని మహానందికి బయలుదేరాడు. పాణ్యం సమీపంలోని రంగయ్య రైసు మిల్లు సమీపంలో ఆటో ఆపి మూత్ర విసర్జనకు జాతీయ రహదారి దాటుతుండగా సుగాలిమెట్ట వైపు నుంచి వేగంగా మోటారు సైకిల్‌పై వెళ్తున్న రమేష్‌నాయక్ ఢీకొన్నాడు. శ్రీరాములుకు తీవ్ర గాయాలు కావడంతో పాణ్యం సీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య కళావతి, కుమా రుడు, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బేతంచెర్ల, జూలై 4: పట్టణంలోని కొత్తపేటలో నివాసముంటున్న కొమ్ము రమాదేవి (30) అనే మహిళ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిందని హెడ్ కానిస్టేబుల్ షేక్షావలి తెలిపారు. కొమ్ము రమాదేవి అనారోగ్యంతో బుధవారం సాయంత్రం విషద్రావణం తాగింది. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఒక కూతురు సంతానం ఉన్నారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

అన్నపై తమ్ముడు దాడి - కేసు నమోదు

అవుకు, జూలై 4 : అవుకు పట్టణం కుమ్మరిదిడ్డి వీధికి చెందిన రవికృష్ణ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌బాబు గురువారం తెలిపారు. రంగనాథ్, రవికృష్ణలు స్వయాన అన్నదమ్ములు. రవికృష్ణను మద్యం సేవించటం మానివేసి, చెడు సావాసాలకు దూరంగా ఉండాలని అన్న రంగనాథ్ మందలించాడు. దీంతో రవికృష్ణ మద్యం సేవించి పగిలిపోయిన మద్యం సీసాతో రంగనాథ్‌పై దాడి చేయగా గాయాల పాలయ్యాడు. తల్లి మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు రవికృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

గుండెపోటుతో భక్తుడి మృతి

ఆళ్లగడ్డ, జూలై 4: బెంగుళూరుకు చెందిన భక్తుడు సురేష్‌కుమార్(46) అహోబిలం లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి గురువారం వచ్చి గుండెపోటుతో మరణించారు. భక్తుడు ఎగువ అహోబిలంలోని ఉగ్రస్తంభం వద్ద మెట్లు ఎక్కుతుండగా అయాసంతో కుప్పకూలిపోయారు. తోటి భక్తులు దేవాలయ సిబ్బందికి సమాచారం అందించి మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులు

నంద్యాల (నూనెపల్లె), జూలై 4: కేంద్ర ప్రభుత్వం జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోందని ఐసీడీఎస్ పీవో నిర్మల గురువారం తెలిపారు. జిల్లాలోని వివిధ రంగాలలో ప్రతిభావంతులైన 5 నుంచి 18 ఏళ్లలోపు వయస్సు ఉన్న బాల బాలికల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని చెప్పారు. జూలై నెల 31వ తేదీ లోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కేంద్ర కమిటీతో ఎంపికైన బాల బాలికలకు రాష్ట్రపతి చేతుల మీదుగా జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేస్తారని తెలిపారు.

కౌలు రైతులకు రుణాలు ఇవ్వండి: జేసీ



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల (కల్చరల్), జూలై 4: జిల్లాలో సీసీ ఆర్సీ కార్డులు మంజూరు చేసిన 22,740 మంది కౌలు రైతులకు పెద్దఎత్తున రుణాలు అందించి ఆదుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి బ్యాంకర్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా బ్యాంకర్ల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యూబీఐ డిప్యూటీ రీజనల్ మేనేజర్ సురేందర్‌గౌడ్, రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ రాజేష్ కె మహాన, నాబార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ ఏపీ శ్రీధర్‌రెడ్డి, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులందరికీ పంట రుణాలు మంజూరుచేయడంతో పాటు జిల్లాలోని 22,748 మంది కౌలు రైతులకు మరింత చేయూత అందించి పెద్దఎత్తున్న రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను సూచించారు. ఆర్‌వోఎఫ్‌ఆర్ కింద పట్టాలు ఇచ్చిన రైతులకు కూడా రుణాలు అందజేయాలన్నారు. పాడిపరిశ్రమకు ప్రభుత్వం తగిన ప్రాధానమిస్తోందని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు, ఉపాధియూనిట్ల స్థాపన, చిన్న మధ్య తరహా, విద్య, గృహ,రుణాలతో పాటు ఇతర ప్రాధాన్యత రంగాలలో వారికి అర్హులకు వారందరికి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. పీఎంఈజీపీ, ముద్ర స్కీము రుణాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు పరిశ్రమ యూనిట్ల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 18,258 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల కింద రూ.780కోట్ల లక్ష్యాన్ని అధిగమించి రూ.1406 కోట్ల రూపాయల రుణాలు మంజూరు చేసి 180 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. అలాగే పంట రుణాల కింద రూ.5384 కోట్లు, వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రుణాలు రూ.8672 కోట్లు, సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమల రుణాల కింద రూ.1335 కోట్లు, మైక్రో ఎంటర్‌ప్రైజెస్ కింద రూ.987 కోట్లు, విద్యా రుణాల కింద రూ.46 కోట్లు, గృహ రుణాల కింద రూ. 57కోట్లు, ప్రాధాన్యత రంగాలకు రూ.10,953కోట్లు మంజూరు చేసినట్లు జేసీ వివరించారు. వ్యవసాయ, అనుబంధ, పారిశ్రామిక ఇతర ఉపాధి రంగాలకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేసిన రుణ వివరాలను ఎల్డీఎం రవీంద్ర కుమార్ వివరించారు. సమావేశంలో బ్యాంకు అధికారులు, సంక్షేమశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పొలంలో నక్క మృతి

కొత్తపల్లి, జూలై 4: మండలంలోని గువ్వలకుంట్ల అటవీ సెక్షన్ పరిధిలోని ఓ పంట పొలంలో ఓ నక్క మృతి చెందింది. గురువారం సెక్షన్ ఆఫీసర్ స్వరూప్, సిబ్బందితో కలిసి నక్క మృతి చెందిన ప్రాంతాన్ని పరిశీలించారు. నక్క కళేబరాన్ని పరిశీలించి మృతికి గల కారణాలను నిశితంగా పరిశీలించారు. అనంతరం నక్క కళేబరాన్ని ఆత్మకూరు అటవీ డివిజన్ కార్యాలయానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ స్వరూప్ మాట్లాడుతూ నక్క పంట పొలాలకు వేసిన క్రిమిసంహారక మందులు తినడం వల్ల చనిపోయిందా? లేక అనారోగ్యం కారణాల వల్ల మృతి చెందిందా? అన్న వివరాలు పోస్టుమార్టం అనంతరం వెల్లడిస్తామని తెలిపారు.

ఎంపీపీ గదిలో టీవీ, ఇన్వర్టర్ మాయం

వెలుగోడు, జూలై 4: వెలుగోడు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఓ టీవీ, ఇన్వర్టర్ అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎంపీడీవో కార్యాలయంలోని ఎంపీపీ గదిలో టీవీ, ఇన్వర్టర్ ఉండేది. అయితే గత వారం రోజుల నుంచి ఆ గదిలోని టీవీ, ఇన్వర్టర్ అదృశ్యమయ్యాయి. అయితే ఆ టీవీ, ఇన్వర్టర్‌ను ఎవరు ఏర్పాటు చేశారు? ఎందుకు ఏర్పాటు చేశారు? ఎలా అదృశ్యమయ్యాయి? అన్న చర్చ కొనసాగుతోంది. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా తాను ఎన్నికల కోసం ఇక్కడకు వచ్చానని, ఆ విషయాలు తమకు తెలియదని విచారణ చేపడతామని వివరణ ఇచ్చారు.



ఎంపీపీ గదిలో ఏర్పాటు చేసిన టీవీ, ఇన్వర్టర్ (ఫైల్)



టీవీ, ఇన్వర్టర్ లేని ఎంపీపీ గది

ఘనంగా మాజీ సీఎం రోశయ్య జయంతి



పండ్లు పంపిణీ చేస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్

నంద్యాల (నూనెపల్లె/కల్చరల్), జూలై 4: ఏపీ మాజీ ముఖ్యమంత్రి దివంగత కొణిజేటి రోశయ్య జయంతిని జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భవనాశి నాగ మహేష్ తదితరులు రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. భవనాశి వెంకటసుబ్బయ్య, వెంకమ్మ చారిటబుల్ ట్రస్టు సహకారంతో ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాదరావు డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు మురళి, నాగరాజు, ప్రసాద్ సందీప్,శ్రీకాంత్ తదితరులుపాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణకు ఆదేశం

గోస్పాడు, జూలై 4: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్‌లో భాగంగా మండలంలోని తేళ్ళపూరి గ్రామంలో జరిగిన ఉపాధి పనులపై విచారణను అంబుడ్స్‌మన్‌కు అప్పగించినట్లు ఏపీవో జ్యోతి తెలిపారు. గ్రామంలో దాదాపు రూ.47 వేలకు సంబంధించి ఉపాధి కూలీలను గ్రామంలో లేనివారికి హాజరు వేసి నిధులు దుర్వినియోగం చేసినట్లు అభియోగం వచ్చిన నేపథ్యంలో విచారణకు ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

ప్రజలకు మంచి రోజులు: ఎమ్మెల్యే



మహానందిలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి దంపతులకు ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో



తమ్మడపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మహానంది, జూలై 4: ప్రజలకు మంచి రోజులు వచ్చాయని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే బుడ్డా తన సతీమణి శైలజతో కలిసి గురువారం మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు. వీరికి ఆలయం ముఖద్వారం వద్ద ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మ వార్లకు ప్రత్యేక అభిషేకార్చన పూజలను జరిపారు. ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో వేదపండితులు ఆశీర్వదించి ప్రసాదాలు అందచేశారు. ఈవో వీరిని శాలువా సన్మానించి, స్వామివారి మెమెంటో బహూకరించారు. ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు రాక్షసపాలన నుంచి విముక్తి కలిగిందని అన్నారు. తనను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపేందుకే నియోజిక వర్గంలో పర్యటిస్తున్నట్లు చెప్పారు. అనంతరం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఎమ్మెల్యే దంపతులను శాలువాతో సన్మానించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త రామలింగారెడ్డి, ఎంపీపీ యశస్వినిరెడ్డి, గాజులపల్లి ఆర్ఎస్ సర్పంచ్ అస్లాం బాషా, పార్టీ మండల మధు, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, నాగపుల్లయ్య, సుబ్రమణ్యం, మల్లికార్జునరావు, మౌళీశ్వరరెడ్డి, జనార్దన్‌రెడ్డి, క్రాంతికుమార్, చిన్న రంగస్వామి, మహేష్ పాల్గొన్నారు.

ఆదుకోవాలని దివ్యాంగులరాలి వినతి

దేవస్థానం ప్రధాన కార్యాలయం నుంచి కార్యక్రమం ముగించుకొని వెలుపలికి రాగానే ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని కలవడానికి ఓ దివ్యాంగురాలు వీలు చైర్ సైకిల్‌పై వేచి ఉన్నారు. ఈ విషయాన్ని గమనించిన ఎమ్మెల్యే యువతి దగ్గరికి సమస్యల గురించి తెలుసుకున్నారు. తాను మహానందిలో భిక్షాటన చేసుకొని జీవిస్తున్నాని దివ్యాంగురాలు చెప్పారు. సైకిల్‌పై భిక్షాటన చేయడం కష్టం ఉందని, ఎలక్ట్రానిక్ స్కూటర్ మంజూరు చేయించాలని కోరారు. అలాగే నివాస స్థలం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బుడ్డా దివ్యాంగురాలికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగురాలి వివరాలు సేకరించి తనకు పంపాలని టీడీపీ నాయకుడు సూరే శ్రీనివాసులుకు సూచించారు.

'ప్రజల రుణం తీర్చుకుంటా'

నమ్మకంతో తనను గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. గురువారం రాత్రి మహానంది మండలం తమ్మడపల్లి, అబ్బీపురం గ్రామాల్లో థ్యాంక్స్ ఫర్ ఓటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలు ఎంతో విసిగి పోయారన్నారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి గ్రామాల్లో కక్షలు పెంచారని, నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేశారని ఆరోపించారు. గ్రామాల్లో ప్రజలు కక్షలకు దూరంగా ఉండాలని సూచించారు. త్వరలోనే మహానంది ఆలయ పాలకమండలిని ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్వినిరెడ్డి, టీడీపీ నాయకులు బుడ్డారెడి శ్రీనివాసరెడ్డి, శ్యామల జనార్దన్‌రెడ్డి, హరి ప్రసాదరెడ్డి, దస్తగిరి, శంకర్, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి



నంద్యాల మున్సిపల్ కార్యాలయంలో నివాళి



నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

నంద్యాల టౌన్, జూలై 4: నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏర్పాటుకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి వెల్లడించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి కమిషనర్‌తో పాటు చైర్‌పర్సన్ మాబున్నీసా, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల (నూనెపల్లె): బ్రిటిష్ పాలకులతో వీరోచిత పోరాటం చేసి అశువులు బాసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలను పోరాటాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శైలజా రాణి అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా కళాశాలలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలను నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పరిమిళ అధ్యక్షతన జయంతి వేడుకలు నిర్వహించారు. చరిత్ర శాఖ హెచ్‌వోడీ, కార్యక్రమ నిర్వాహకులు చిట్టమ్మ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు త్యాగాన్ని అందరూ స్మరించుకోవాలని, ఆయన చేసిన త్యాగానికి ప్రతిఫలంగా పట్టణ కూడళ్లలో సీతారామరాజు విగ్రహాలు నిర్మించాలని ఆయన చరిత్రపై మ్యూజియం ఏర్పాటు చేయాలని కోరారు. అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రకు సంబంధించిన వీడియోను ప్రదర్శించారు.

ఆత్మకూరు: మన్యంవీరుడు అల్లూరి సీతారామారాజు పోరాటం స్ఫూర్తిదాయకమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం అల్లూరి 126వ జయంతిని పురస్కరించుకుని స్థానిక కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం



నందికొట్కూరులో ర్యాలీ చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



పాణ్యంలో..



ఆత్మకూరులో..

నందికొట్కూరు, జూలై 4: నీట్, నెట్ పరీక్షా పేపర్ల లీకేజీని నిరసిస్తూ నందికొట్కూరు పట్టణంలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన దేశ వ్యాప్త బంద్ ప్రశాంతంగా ముగిసింది. విద్యార్థి జేఏసీ నాయకులు శ్రీనివాసులు, రంగస్వామి, నవీన్, కుమార్, మర్రిస్వామి, హరినాథ్, జగదీష్ మాట్లాడుతూ లీకేజీకి కారణమైన ఎన్‌టీఏ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా పాఠశాలల మూసివేతను ఆపాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ నాయకులు అనిల్, తహర్, అశోక్, హరిఫ్, నోఫిల్, రాము, హకీమ్, సోని, అరవింద్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అవకతవకలను నిరసిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు గురువారం ఆత్మకూరు పట్టణంలో చేపట్టిన విద్యా సంస్థల బంద్ ప్రశాంతంగా ముగిసింది. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జునైద్‌బాషా, ఏఐఎస్‌ఏ జిల్లా కార్యదర్శి నాగార్జున, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దినేష్‌లు పట్టణంలోని పలు విద్యాసంస్థల వద్దకు వెళ్లి బంద్ చేయించారు. వారు మాట్లాడుతూ నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలకు బహిర్గం చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థి సంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఉన్నారు.

పాణ్యం: నీట్ పరీక్షల లీక్‌లపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ గురువారం చేపట్టిన వామపక్ష విద్యార్థి సంఘాలు బంద్ చేపట్టాయి. విద్యాసంస్థలను యాజమాన్యాలు స్వచ్ఛందంగా మూసివేశాయి. విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండు కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు ప్రతాప్, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రతాప్, వెంకటాద్రి, కార్తీక్, వేణు, శ్రీరాం, రాజు, విగ్నేష్ పాల్గొన్నారు.

మిట్టకందాలలో పర్యటన

పాములపాడు, జూలై 4: మండలంలోని మిట్టకందాల గ్రామంలో గత ఎనిమిది రోజులుగా అతిసార కేసులు పెరుగుతూ ఉన్నాయి. దీంతో గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారు. గురువారం గ్రామాన్ని అడిషనల్ డీఎంహెచ్‌వో శారద సందర్శించారు. కేసులు పెరగగానికి గల కారణాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వైద్యులకు తెలిపారు. ఎనిమిది రోజుల్లో 30కి పైగా కేసులు నమోదు కావడంతో వైద్య సిబ్బంది గ్రామంలో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ చికిత్సలు చేస్తున్నా రోజురోజుకు కేసులు పెరుగుతూ ఉన్నాయి. గ్రామంలోని ప్రదాన కూడలి, క్రిష్ణరావుపేట రహదారి, బుడ్డానగర్ గ్రామాలకు నీటి సరఫరా అయ్యే పైప్‌లైన్‌లు లీక్ కావడంతో నీరు కలుషితం అవుతుండంతో గుర్తించిన సిబ్బంది మరమ్మతులు పూర్తిచేశారు. పాములపాడు, మిట్టకందాల, ఆత్మకూరు, కర్నూలు వైద్యశాలలో చికిత్సలు పొందుతున్నారు. గ్రామంలో ఇంటింటికి ఫిల్టర్ వాటర్ అందిస్తున్నామని, శానిటేషన్, ట్యాంక్‌లలో క్లోరినేషన్ చేయిస్తున్నామని తగు జాగ్రత్తలు చర్యలు తీసుకొంటున్నట్లు ఎంపీడీవో సరస్వతి తెలిపారు. కలుషిత నీటిలోని బ్యాక్టీరియా ప్రబావం నీరు త్రాగిన వారిలో ఉండటం వలన కేసులు నమోదు అవుతున్నట్లు వైద్యాధికారిణి నాగలక్ష్మి తెలిపారు.

'గుర్తింపు కార్డులు తప్పనిసరి'

ఆత్మకూరు రూరల్, జూలై 4: కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలంటే కౌలు రైతులు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. గురువారం వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరు మండలంలోని అన్ని గ్రామాల రైతులు ఎవరైతే పొలం కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నారో వారు తప్పనిసరిగా పంట సాగు హుక్కు పత్రం కలిగి ఉండాలన్నారు.

'పచ్చదనం ప్రగతికి సంకేతం'



నల్లకాల్వలో మొక్కకు నీరు పోస్తున్న డీడీ సాయిబాబా



బండిఆత్మకూరు రేంజ్ కార్యాలయం ఆవరణలో మొక్క నాటుతున్న అటవీ అధికారులు

ఆత్మకూరు, జూలై 4: పచ్చదనం ప్రగతికి సంకేతమని ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ వి.సాయిబాబా పేర్కొన్నారు. గురువారం వనం-మనం వారోత్సవాల్లో భాగంగా ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని నల్లకాల్వ గ్రామ ఎంపీపీ పాఠశాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణ ఎంతో కీలకమని అన్నారు. పెరుగుతున్న జనాభాతో అటవీ సంపద తగ్గుతూ.. పర్యావరణ వినాశనాలకు తావిస్తోందని అన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు, బైర్లూటి రేంజ్ ఆఫీసర్లు పట్టాభి, సుభాష్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం నాగరాజు తదితరులు ఉన్నారు.

బండిఆత్మకూరు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి భావి తరాలను పరిరక్షించాలని ఎఫ్ఆర్‌వో నసీర్ ఝా, వెటర్నరీ డాక్టర్ అనూష సూచించారు. గురువారం స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ అల్లూరి సీతారామరాజు జయంతిని పురష్కరించుకొని 76వ వన మహోత్సవాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ మొక్కలు వనాలైతే ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత నాటిన వారు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వోలు వెంకట సుబ్బయ్య, తేజ, సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతిలో మంత్రులను కలిసిన ఎమ్మెల్యే



మంత్రి టీజీ భరత్‌తో ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు, జూలై 4: మంత్రులు సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, టీజీ భరత్, కళా వెంకట్రావును నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య గురువారం అమరావతిలో కలిశారు. ఆయా శాఖలకు సంబంధించిన పలు అభివృద్ధి పనులపై లేఖలు రాయడంతో పాటు నియోజకవర్గంలో సుదీర్ఘ కాలంగా తిష్ట వేసిన పనుల పరిష్కారంపై మంత్రులతో చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు నందికొట్కూరు మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, పలుచాని మహేశ్వరరెడ్డి ఉన్నారు.

మంత్రిని కలిసిన ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్



ఫరూక్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సరళమ్మ

నంద్యాల (నూనెపల్లె), జూలై 4: రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ సరళమ్మ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో సరళమ్మ మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు చెప్పారు.

నాణ్యమైన విద్యను అందించాలి: డీఈవో



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో సుధాకర్‌రెడ్డి

గడివేముల, జూలై 4: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని డీఈవో సుధాకర్‌రెడ్డి సూచించారు. గడివేములలోని జిల్లాపరిషత్ హైస్కూల్, గడిగరేవులలోని హైస్కూల్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు సాంకేతికతను ఉపయోగించి బోధన చేయాలని అన్నారు. నిర్ణీత సమయంలో సిలబస్ పూర్తి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవోఎస్ఎస్ డీసీ సత్యనారాయణ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'జలాశయంలో చేపలు పట్టొద్దు'

వెలుగోడు, జూలై 4: వెలుగోడు జలాశయంలో జూలై, ఆగస్టు మాసాలలో మత్స్యకారులు చేపలు పట్టవద్దని మత్స్య శాఖ అభివృద్ధి అధికారి భరత్‌లాల్ నాయక్ అన్నారు. ఏటా జూలై, ఆగస్టు నెలల్లో చేపల వేట నిషేధమని చెప్పారు. ఈ రెండు మాసాలలో చేపలు సహజంగా సంతానోత్పత్తి చేస్తాయని, మత్స్యకారులెవరూ చేపల వేటకు వెళ్లొద్దని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సులు రద్దు చేయడానికి వెనుకాడబోమన్నారు. ఈ మేరకు వెలుగోడు, బోయరేవుల, మోతుకూరు, గుంతకందాల వేల్పనూరు, గ్రామాలలో చాటింపు వేయించాలని సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. అలాగే రెవెన్యూ, స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎంపీడీవోలకు సమాచారం అందించినట్లు తెలిపారు. చేపల గోడౌన్ వద్ద నోటీసులు అంటించినట్లు చెప్పారు.

'విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు'

వెలుగోడు, జూలై 4: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో బ్రహ్మంనాయక్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నళినిలు అన్నారు. గురువారం వెలుగోడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు దుస్తులు, బూట్లు, పుస్తకాలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు టీడీపీ నేతలు కలిసి పంపిణీ చేశారు. మోడల్ స్కూల్ హాస్టల్లో విద్యుత్ సమస్య లేకుండా ఇన్వర్టర్‌ను బిగిస్తామని మాజీ ఎంపీపీ అన్నారపు సీతమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు అన్నారపు శేషి రెడ్డి తెలిపారు. టీడీపీ నాయకులు సూర్య నారాయణ, అబ్దుల్ కలాం, మాజీ ఎంపీపీ కృష్ణుడు, అమీర్, శంకర్‌రెడ్డి, ఖలీల్, మోమిన్ రసూల్, స్వామన్న, జాకీర్ హుసేన్, బీజేపీ నాయకులు రాజశేఖరరెడ్డి, ప్రతాప్, జనసేన నాయకులు షాలు బాషా, సుకన్య తదిరతులు పాల్గొన్నారు.

'బీసీజీ టీకాతో క్షయవ్యాధి నిర్మూలన'

కొత్తపల్లి, జూలై 4: బీసీజీ టీకాతో క్షయవ్యాధి నిర్మూలించవచ్చని కొత్తపల్లి మండల టీబీ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్ తెలిపారు. గురువారం మండలంలోని శివపురం గిరిజనగూడెం చెంచులకు బీసీజీ టీకా, క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌డీటీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న సిబ్బంది

గడివేముల, జూలై 4: మండలంలోని బిలకలగూడురు గ్రామ సమీపంలో వెలసిన బాలాజీ ఆలయంలో గురువారం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. జిందాల్ పరిశ్రమ ఆలయ అర్చకుడు విష్ణు భట్టాచార్యులు వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పూర్ణాహకలశ స్థాపన, అగ్నిప్రతిష్ఠ, సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో జిందాల్ పరిశ్రమ సిబ్బంది స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పురవీధుల్లో మంగళవాయిద్యాలతో ఊరేగింపు చేశారు. పరిశ్రమ యూనిట్ ఇన్‌చార్జి నవనీత్‌చౌహాన్, కుమార్ వినిత్ సిన్హా, శర్మ, జిందాల్ పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, జూలై 4: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో గురువారం నెల్లూరుకు చెందిన కె. త్రిపుర నిఖిత బృందంతో కూచిపూడి నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతిం, భో..శంభో, శివాష్టకం, అర్ధనారీశ్వరం, అర్ధనారీశ్వర తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

'క్షయవ్యాధి నివారణకు బీసీజీ టీకా'

చాగలమర్రి, జూలై 4: గ్రామాల్లో క్షయవ్యాధి నివారణ కోసమే బీసీజీ టీకాలు వేస్తున్నామని వైద్యశాఖ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి తెలిపారు. గురువారం చాగలమర్రిలోని చెన్నకేశవ ఆలయ ఆవరణలో బీసీజీ టీకాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

ఎమ్మెల్యే కోట్ల ఆకస్మిక తనిఖీలు

- బీసీ బాలికల హాస్టల్‌లో వార్డెన్ లేకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం
- ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

డోన్, జూలై 4: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీలతో అధికారులను పరుగులు పెట్టించారు. గుత్తి రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే కోట్ల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఎమ్మెల్యే కలియ తిరుగుతూ అన్ని విభాగాలను పరిశీలించారు. ఇన్ పేషెంట్లు, ఔట్ పేషెంట్లుకు అందుతున్న వైద్యసేవలపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మించిన ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్ల కొరత, సిబ్బంది కొరత ఉందని, ఆసుపత్రిలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని రోగులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. టవర్స్, సిగ్నల్స్ పని చేయకపోవడంతో ఆసుపత్రిలో సమాచారం అందించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని విన్నవించారు. వైద్యం ఎలా అందుతుందని రోగులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి పక్కనే ఉన్న మహాత్మ జ్యోతిరావుపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే కోట్ల తనిఖీ చేశారు. వంట గదిలో విద్యార్థినులకు వండిన అన్నం, పప్పు, కర్రీలను ఆయన పరిశీలించారు. మెనూ గురించి పాఠశాల ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా తరగతి గదిలోకి వెళ్లి ఎమ్మెల్యే కోట్ల విద్యార్థినులతో ఉల్లాసంగా మాట్లాడారు. ఉదయం ఏమి టిఫిన్ తిన్నారు.. మధ్యాహ్నం, రాత్రి భోజనం ఎలా పెడుతున్నారూ..? రుచికరంగా ఉంటుందా అని స్వయంగా విద్యార్థులను అడిగి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. విద్యార్థినులు బాగా చదువుకునేలా ఉపాధ్యాయులు మోటివేషన్ చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని ప్రతి రోజు విద్యార్థినులు స్నానాలు చేసేలా అన్ని చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, కోట్రికే ఫణిరాజ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్ మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణి గౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మద్రి రమణ, చిట్యాల మద్దయ్యగౌడు, సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, ఓంప్రకాష్, ఎస్ఎండీ రఫీ, ఎస్‌టీ హరూన్, సీమ సుధాకర్ రెడ్డి, రంజిత్ కిరణ్, గోవిందరెడ్డి, బీజేపీ డోన్ అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్డె మహారాజ్, హేమసుందర్ రెడ్డి ఉన్నారు.



డోన్ ప్రాంతీయ వైద్యశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

- పట్టణంలోని షాదీఖానా పక్కనే ఉన్న బీసీ బాలికల హాస్టల్‌ను ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తనిఖీ చేశారు. ఆ సమయంలో వార్డెన్ లేకపోవడంతో ఎమ్మెల్యే కోట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.
- డోన్ పట్టణ సమీపంలోని ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో మరో రెండు నెలల్లో పూర్తి స్థాయిలో రోగులకు వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి వెల్లడించారు. గురువారం ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన అనంతరం ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ కొత్తగా నిర్మించిన ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్లు, సిబ్బంది కొరత ఉందని తెలిపారు. రోగులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించే పరికరాలు ఇంకా అందుబాటులో లేవన్నారు. కేవలం గ్రౌండు ఫ్లోర్ విభాగాలు మాత్రమే పూర్తయ్యాయని, ఇంకా రెండో అంతస్తు పూర్తికాలేదన్నారు. సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అన్నారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

నంద్యాల, జూలై 4(ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు సేవలు మరువ రానివని, ఎంఈవో శోభావివేకవతి, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల అధ్యక్షుడు అమీర్‌బాషా అన్నారు. అల్లూరి సీతారామరాజు 127వ జయంతిని పురస్కరించుకొని ఆళ్లగడ్డ పట్టణంలోని వైపీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేషారెడ్డి, నారాయణరెడ్డి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రిలోని బీసీ సంఘం కార్యాలయంలో టీడీపీ నంద్యాల జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి సల్లా నాగరాజు ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుత్తి నరసింహులు, రామతీర్థం, వీరయ్య, ఉసేనయ్య, సుబ్బరాయుడు, సుధాకర్‌రెడ్డి, చోటు, అబ్దుల్లా, ఓబులేసు, సమ్మద్, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం: రుద్రవరం ఆదర్శ పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ సురేశ్‌కుమార్, పీడీ శ్రీనివాసులు, జానా కిరణ్‌కుమార్, జాయిషీ, వసుంధర, జ్యోత్స్న, శిరీషాభాయ్, రఫి పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం కోవెలకుంట్ల మండల శాఖ ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజయ్య అధ్యక్షతన అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సీతారామరాజు చిత్రపటానికి రాజయ్య పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీపతి, ఉపాధ్యాయులు నాగేశుడు, మల్లికార్జున, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని శ్రీవాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ వేణుగోపాల్ అధ్యక్షతన అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

బేతంచెర్ల: సౌత్ ఇండియా మైనింగ్ కంపెనీ కార్యాలయంలో గురువారం వికాస భారతి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలు, స్వామి వివేకానందుని వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వికాస భారతి ప్రధాన కార్యదర్శి నాగేంద్ర ప్రసాద్, వికాస భారతి సభ్యులు మారుతి కృష్ణ, నాగమోహన్, చంద్రమౌళీశ్వరరెడ్డి, మధుమోహన్ రెడ్డి, సతీష్ కుమార్, మాణిక్యం శెట్టి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అమీర్‌బాషా



చాగలమర్రిలో అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు



రుద్రవరం ఆదర్శ పాఠశాలలో..

గ్రంథాలయానికి స్థలం కేటాయించండి

కొలిమిగుండ్ల, జూలై 3: కొలిమిగుండ్లలో గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకుందని, నూతన గ్రంథాలయ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని జనసేన మండల అధ్యక్షుడు గుజ్జల పెద్దయ్య డిమాండ్ చేశారు. జనసేన నాయకులు, టీడీపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సునితాభాయికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బెలుం పృథ్వీ, రమణ పాల్గొన్నారు.

'డెంగీతో అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, జూలై 4: గ్రామాల్లో ప్రజలు డెంగీతో అప్రమత్తంగా ఉండాలని ముత్యాలపాడు వైద్యాధికారిణి తస్లీమ్ సుల్తాన సూచించారు. మండలంలోని పెద్దవంగలి గ్రామంలో గురువారం డెంగీ నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

చాకరాజువేముల ఎంపీటీసీ రాజీనామా

దొర్నిపాడు, జూలై 4: మండలంలోని చాకరాజువేముల గ్రామంలో వైసీపీకి చెందిన ఎంపీటీసీ కట్టుబడి షాజహాన్ గురువారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసులకు గురువారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో ఎంపీటీసీ పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

డోన్(రూరల్), జూలై 4: డోన్ సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సూచించారు. గురువారం డోన్ పట్టణంలో ఎమ్మెల్యే కోట్లను అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఓబులేసు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యేను పుష్పాలు, దుశ్శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లకు సంబంధించి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

వర్షం కోసం పూజలు

డోన్(రూరల్), జూలై 4: పట్టణంలోని శివాలయాల్లో వర్షాలు పడి రైతులు సుభిక్షంగా ఉండాలని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పట్టణంలోని పాతబుగ్గ, కొత్తబుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయాలు, పాతపేట శివాలయం, పోలీస్‌స్టేషన్ ప్రాంతంలోని సాంబశివాలయాల్లో అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా ఆలయాల పురోహితులు ప్రకాష్ శర్మ, ప్రహల్లాద శర్మ, రామస్వామి, కల్లె శేషావలి శర్మ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

శిరివెళ్ల, జూలై 4: నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలోని పచ్చర్ల గ్రామ పరిసరాల్లో ఇటీవల చిరుత దాడిలో మృతి చెందిన మాజీ ఉప సర్పంచ్ షేక్ మెహరున్నీసా కుటుం బసభ్యులకు అటవీశాఖ అధికారులు రూ.23 వేలు ఆర్థిక సాయం అందించారు. నంద్యాల డీఎఫ్‌వో ఆధ్వర్యంలో చలమ అటవీ రేంజ్ సిబ్బంది, మొబైల్ పార్టీ సిబ్బంది తమవంతు బాధ్యతగా ఆర్థిక సాయం అందజేశారు.

ముమ్మరంగా వ్యాక్సినేషన్

బనగానపల్లె, జూలై 4 : బనగానపల్లె పట్టణంలోని సచివాలయాల పరిధిలో గురువారం టంగుటూరు వైద్యాధికారి డాక్టర్ శివశంకరుడు, సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 18 నుంచి 60 ఏళ్ల వయస్సు గల వారికి అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేశారు. ఈవ్యాక్సిన్ వల్ల టీబీ జబ్బులకు ఇన్‌ఫెక్షన్ కాకుండా నివారిస్తుందన్నారు. షుగర్, స్మోకింగ్ అలవాట్లు ఉన్న వారు, టీబీ మందులు వాడే వారికి ఈవ్యాక్సిన్ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. అతిసారా నివారణకు ఏఎన్ఎం, ఆశావర్కర్లు చర్యలుతీసుకోవాలని డాక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల, జూలై 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని పశువులకు, గొర్రెలకు, మేకలకు వ్యాక్సినేషన్‌ను కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని పశుసంవర్ధకశాఖ డీడీ రమణయ్య పశువైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని రేంజ్ కార్యాలయంలో సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. డీడీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీలు మోహన్‌రావు, మారుతి, బ్రహ్మం, పశువైద్యాధికారులు, జేవీవోలు, ఏహెచ్ఎలు పాల్గొన్నారు.

రోగులకు ఆర్థిక సాయం

బనగానపల్లె , జూలై 4 : వసుధాఫౌండేషన్ వ్యవస్థాక అధ్యక్షుడు మంతెన వెంకటరామరాజు సహకారంతో పేద రోగులకు గురువారం టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య, టీడీపీ నాయకుడు వంగల పరమేశ్వరరెడ్డిల చేతుల మీదుగా రూ. 58 వేల చెక్కులను పంపిణీ చేశారు. పట్టణంలోని టంగుటూరు శ్రీనయ్య కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకుడు వంగల పరమేశ్వరెడ్డి మాట్లాడుతూ వసుధాఫౌండేషన్ సంస్థ బనగానపల్లె పరిసర ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఆర్థిక సాయం అందిస్తూ ఎంతోమందికి సాయపడుతోందన్నారు. కార్యక్రమంలో టీచర్ నాగరాజు, మల్లారెడ్డి, బత్తుల బాలిరెడ్డి, బాస్కర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, లాయర్ నాగేంద్రారెడ్డి, ఖాదర్, మల్లేశ్‌రెడ్డి, తలారి తిరుమలయ్య, బాబయ్య, దేవుడు, వంకదారి ప్రసాద్, సంగు శ్రీనివాసరెడ్డి, కాసుజంగంశెట్టి, బాలరాజుయాదవ్, షేక్షావలి, యాగంటిపల్లె దస్తగిరి పాల్గొన్నారు.



వసుధా ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్న కోఆర్డినేటర్ టంగుటూరు శ్రీనయ్య

ఘనంగా వంగవీటి మోహన్‌రంగా జయంతి

బేతంచెర్ల, జూలై 4: రాష్ట్ర కాపు సంఘం నాయకుడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన్‌రంగా 77వ జయంతి వేడుకలను బలిజ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలో బలిజ సంఘం నాయకులు కొత్తబస్టాండు నుంచి పాతబస్టాండు మీదుగా ప్రభుత్వ ఆసుపత్రి వరకు ర్యాలీగా వెళ్లి ప్రభుత్వ వైద్యాధికారులు డా.చరణ్ రాజు, డా.స్వప్న ప్రియ ఆసుపత్రిలోని బాలింతలకు, రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు రుద్రవరం నారాయణ, గోరుమానుకొండ, హరిరామకృష్ణ మోహన్, ఫణిసాయి, మద్దిలేటి కౌశిక్ పాల్గొన్నారు.



వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

'ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి'

రుద్రవరం, జూలై 4: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి సూచించారు. గురువారం రుద్రవరం అటవీ రేంజ్‌లో 76వ వనమహోత్సవం నిర్వహించారు. సబ్ డీఎఫ్‌వో మాట్లాడుతూ రేంజ్‌లోని శీతల్ బేస్ క్యాంపు, పాల్కన్ బేస్‌క్యాంపు నూ్తతల సెక్షన్‌లో మొక్కలు నాటామని చెప్పారు. రేంజర్ శ్రీపతినాయుడు డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసర్లు మక్తర్ బాషా, నాగరాజు, శ్రీనివాసులునాయుడు, బీట్ ఆఫీసర్లు విజయవర్ధన్, హుసేన్ బాషా, నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.



రుద్రవరం రేంజ్‌లోని అటవీ ప్రాంతంలో మొక్క నాటుతున్న సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి

నంద్యాల, జూలై 4(ఆంధ్రజ్యోతి): అహోబిలంలో గురువారం అటవీ అధికారులు వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. పర్యావరణం పరిరక్షణ అందరి బాధ్యత అని రేంజర్ శ్రీపతినాయుడు అన్నారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

'డ్రాగన్ ఫ్రూట్ సాగుతో అధిక లాభాలు'

ఉయ్యాలవాడ, జూలై 4: డ్రాగన్ ఫ్రూట్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని కోవెలకుంట్ల క్లస్టర్ హార్టికల్చర్ అధికారి ధరణి తెలిపారు. గురువారం పెద్దయమ్మనూరు గ్రామ రైతు సుధాకర్ సాగుచేసిన డ్రాగన్ ఫ్రూట్ తోటన పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ డ్రాగెన్ ఫ్రూట్ సాగుకు ప్రభుత్వం మొదట ఏడాది హెక్టారుకు రూ.30 వేలు, రెండు, మూడో ఏడాది రూ. 10 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. అలాగే మామిడికి హెక్టారుకు రూ.13,300, బత్తాయికి రూ. 16,004, దానిమ్మకు రూ.26,672, హైబ్రిడ్ కూరగాయల సాగుకు రూ.20 వేలు, పూల సాగుకు రూ.16 వేలు సబ్సిడీ ఇస్తుందని చెప్పారు.

'అతిసారతో అప్రమత్తంగా ఉండాలి'

ఉయ్యాలవాడ, జూలై 4: అతిసారతో అప్రమత్తంగా ఉండాలని మాయలూరు వైద్యశాల ఎంపీహెచ్ఎస్ మునిస్వామి సూచించారు. గురువారం రూపనగుడి గ్రామంలో అతిసార నివారణపై అవగాహన కలిపంచారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్ఎం ఆశీర్వాదమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య'

శిరివెళ్ల, జూలై 4: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందిస్తున్నట్లు అలెస్కో కో-ఆర్డినేటర్ రఘురామిరెడ్డి అన్నారు. శిరివెళ్లలోని ఎంఈవో కార్యాలయంలో 'నేను బడికి పోతా' కార్యక్రమంపై గురువారం సమావేశం నిర్వహించారు. శిరివెళ్ల మండలంలో చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వచ్చి చేరుతున్నారన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శంకర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

'కౌలు పత్రాల కోసం దరఖాస్తు చేసుకోండి'

చాగలమర్రి, జూలై 4: ఖరీఫ్ సీజన్‌లో కౌలుకు పొలం తీసుకొని సాగు చేస్తున్న రైతులు కౌలు పత్రాల కోసం రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఏవో రంగనేతాజీ రైతులకు సూచించారు. గురువారం ముత్యాలపాడు గ్రామంలోని శ్రీలక్ష్మి సీడు విత్తనాల దుకాణాన్ని తనిఖీ చేశారు. మొక్కజొన్న విత్తనాలను పరిశీలించి శాంపిల్స్‌కు సేకరించారు. ఆయన మాట్లాడుతూ కౌలు పత్రాల ద్వారా బ్యాంకులలో పంట రుణాలు, పంట నమోదు, పంటల బీమా, పంట నష్టపరిహారం పొందవచ్చని చెప్పారు. 50 మంది రైతులు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం

చాగలమర్రి, జూలై 4: చాగలమర్రి గ్రామంలోని ప్రైవేటు విద్యా సంస్థలు బంద్‌ను పాటించారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులను బంద్ పిలుపు మేరకు ఇళ్లకు పంపించారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ జాతీయస్థాయి పరీక్షల్లో అవకతవకులు, వ్యత్యాసాలతో, బాధ్యాతారాహిత్యంతో పరీక్షలు నిర్వహించారని ఆరోపించారు. ఉన్నత విద్య మాత్రమే కాకుండా పాఠశాల విద్యా పరిస్థితి దారుణంగా తయారు చేశారని విమర్శించారు.

ఆళ్లగడ్డ: అఖిల భారత విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఆళ్లగడ్డలో ప్రైవేటు పాఠశాలల బంద్ ప్రశాంతంగా జరిగింది. నీట్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని గురువారం పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చాయి.

బేతంచెర్ల: విద్యాసంస్థల బంద్ బేతంచెర్లలో విజయవంతమైందని జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ కుమా ర్ తెలిపారు. అయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల బంద్ చేయించారు. కార్యక్రమంలో నాయకులు ప్రదీప్, భాస్కర్, శివ, గణేష్, వెంకటాచారి, నంది విశ్వనాథ్, మనోహర్, ఇసాక్, మధుకృష్ణ, సాయి, వెంకట సుభాష్, రియాజ్, ఇద్రుస్, రమేష్ తేజ, సుబ్బయ్య పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్లలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. కార్యక్రమంలో జిల్లా నాయకులు మాబు హుసేన్ ఎస్ఎఫ్ఐ నాయకులు బాబు, యశ్వంత్, సూరిబాబు, విక్రమ్, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

డోన్(రూరల్): డోన్‌లో చేపట్టిన విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా జరిగింది. ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కొత్త బస్టాండు రోడ్డులో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సూర్యప్రతాప్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పవన్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు మహబూబ్‌బాషా, అశోక్, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి నక్కి హరి పాల్గొన్నారు.

బనగానపల్లె: నీట్, నెట్ నిర్వహిస్తున్న ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో పాఠశాలలు బంద్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రిస్వామి, నాయకులు ఉస్మాన్, నాగార్జున పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి: ఏవో

అవుకు, జులై 4 : మండలంలోని రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్ అన్నారు. గురువారం శింగనపల్లె గ్రామంలోని రైతుసేవా కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు పొలాన్ని రైతులతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ వర్షాకాలం ముందు నవధాన్యాల పంటలైన రాగులు, కొర్ర, జొన్న, మినుము, మొక్కజొన్న, ధనియాలు, పెసర, మెంతులు, శనగలు విత్తనాలను పొలాల్లో చల్లాలన్నారు. పూత దశకు వచ్చిన వెంటనే పొలంలో కలియదున్నాలన్నారు. దీంతో నేల గుళ్ల బారి, వానపాములు వృద్ధి చెంది, నీటినిల్వ శాతం పెరిగి, భూమిలో సేంద్రియ కార్బన్ శాతం పెరుగుతుందన్నారు. అలాగే పంటలకు కావలసిన పోషకాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యానవన సహాయకులు బాషా, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

కోవెలకుంట్ల, జూలై 4: పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఉచిత వైద్య శిబిరం ఎంతో ఉపయోగపడుతుందని కోవెలకుంట్ల ఈవోపీఆర్డీ రాధికారెడ్డి పేర్కొన్నారు. గురువారం కోవెలకుంట్లలోని మేజర్ గ్రామ పంచాయతీలో ఉప సర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో శాంతిరామ్ వైద్యబృందం ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ప్రత్యేక గుండె వైద్య నిపునులు మనిజా షావళి పాల్గొని సుమారు రెండు వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ వైద్య శిబిరాలు నిర్వహించడం వల్ల ఎంతో మందికి మేలు జరుగుతుందన్నారు. వైద్య శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో గోపినాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అల్లూరి జయంతి

ప్యాపిలి, జూలై 4: అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, నవీన్‌పాటి, రామక్రిష్ణయ్య, నవీన్, ఓబులేసు, వెంకటరమణ, మద్దిలేటి పాల్గొన్నారు.















